# మరో గ్రంథాలయ ఉద్యమం.. 13 పాఠశాలలకు
# ఉచితంగా కంప్యూటర్, గ్రంథాలయ పుస్తకాలు

**విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం.. పాఠశాలలకు పుస్తకాల పంపిణీ**
**పఠనాసక్తి పెంపొందించడమే ధ్యేయం.. డాక్టర్ జాస్తి శివరామకృష్ణ సేవలు అభినందనీయం**



**తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 21:**

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు ఆధునిక విద్యకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో డాక్టర్ జాస్తి శివరామకృష్ణ ఆధ్వర్యంలో మంగపేట మండలంలోని 13 పాఠశాలలకు కంప్యూటర్ సంబంధిత పుస్తకాలు, గ్రంథాలయ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మేనమామ గంటా భగీరథుడు సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారి జ్ఞానాన్ని విస్తరించడంతో పాటు సర్వతోముఖ అభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో ప్రతిరోజూ విద్యార్థులకు పుస్తకాలను అందుబాటులో ఉంచి సద్వినియోగం చేస్తామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 22న డాక్టర్ జాస్తి శివరామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండల విద్యాధికారిణి పొడెం మేనక మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉచితంగా గ్రంథాలయ పుస్తకాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడంతో పాటు జ్ఞానాన్ని విస్తరించేందుకు దోహదపడతాయని తెలిపారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా”

## పెండింగ్ మెస్ చార్జీలు వెంటనే చెల్లించాలి”







**సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్ 21 (తెలుగుగళం)న్యూస్ :** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ మెస్ చార్జీలు, కేంద్ర ప్రభుత్వం అందించే రూ.1,000 వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి నక్కా రాజేశ్వరరావు కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అల్పాహార బిల్లులను వెంటనే చెల్లించాలని, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేసి వంట కార్మికుల చేతనే అల్పాహార పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు రూ.10 వేల వేతనం అమలు చేయడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో: ఏఐటీయూసీ ఖమ్మంజిల్లా ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, షేక్ రహీమున్నిసా, కుంట వెంకమ్మ, మహాదేవ లక్ష్మి, కారం నాగలక్ష్మి, పూచి సీత, రత్నమాల, రాఘవమ్మ, సత్యవతి, సుజాత, కర్నాటి బసవయ్య, తలగారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కరువు ప్రభావిత మండలంగా గుర్తించి రైతులను ఆదుకోవాలి



**తెలుగు గళం న్యూస్ గుంతకల్, సెప్టెంబర్ 21:**

ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, పంట నష్టాలను దృష్టిలో ఉంచుకుని గుంతకల్ ప్రాంతాన్ని శాస్త్రీయంగా, క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి కరువు ప్రభావిత మండలంగా అధికారికంగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని గుంతకల్ బీజేపీ నాయకులు కోరారు.

ఈ మేరకు సోమవారం ఉదయం గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసులు గారిని కలిసి జనతా వారధి కార్యక్రమం ద్వారా వినతిపత్రం సమర్పించారు. వర్షాభావం కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని పంట నష్టాలను సమగ్రంగా అంచనా వేసి, అర్హులైన రైతులకు అవుట్‌పుట్ సబ్సిడీతో పాటు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని వారు కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీవో శ్రీనివాసులు స్పందిస్తూ, రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనతా వారధి కన్వీనర్ జీలకర్ర విక్రమ్, బీజేపీ రాష్ట్ర నాయకులు, ఖీజ× స్టేట్ డైరెక్టర్




వనగుంది విజయలక్ష్మి, ఎలక్షన్ జిల్లా కన్వీనర్ గుర్రం సూర్యనారాయణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగంశెట్టి విశ్వనాథ్, పాత గుంతకల్ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, మహిళా మోర్చా నాయకురాలు లక్ష్మి, కిసాన్ మోర్చా నాయకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషీధర్ రెడ్డి

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**



రేగొండ మండల కేంద్రానికి చెందిన రాచకొండ సారయ్య-రాజమణి దంపతుల మనవరాలి 21వ రోజు (బారసాల) వేడుకకు బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పాప ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగంపల్లి ప్రసాద్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి,సీనియర్ నాయకుడు ముప్పు నరేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పెండేల రాజు,మండల ప్రధాన కార్యదర్శి తూర్పాటి మల్లేష్,చల్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో యువకుడి మృతి

## తిరుమలగిరిలో విషాదం



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటన రేగొండ మండలంలోని తిరుమలగిరిలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి అఖిల్ (20) డీజే,టెంట్‌హౌస్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.సుమారు 20 రోజుల క్రితం అతడు కళ్లు తిరిగి కిందపడిపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు.అక్కడ చికిత్స పొందుతున్న అఖిల్‌కు సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయిందని,మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు.మృతుడికి తల్లిదండ్రులు పద్మ,అయిలుస్వామి,సోదరుడు నాగరాజు ఉన్నారు.చేతికి వచ్చిన కుమారుడు చిన్న వయసులోనే మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# బేతుపల్లిలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం”



**సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్ 21 (తెలుగుగళం)న్యూస్:** పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో గల గంగారం సెక్టార్ పరిధిలోని బేతుపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని సూపర్ వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించి, విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని తల్లులకు పాల్గొన్న సిడిపిఓ బి. సత్యవతి అవగాహన కల్పించారు.చిన్నారుల శారీరక,మానసిక వికాసానికి అవసరమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం దాని ప్రాధాన్యతను తల్లులకు వివరించారు. చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ టీచర్లు కమల, కాంతమ్మ, నాగలక్ష్మి, నాగేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్ దరఖాస్తులకు
# సత్వర పరిష్కారం చూపాలి

**27 దరఖాస్తులు స్వీకరణ.. శాఖల వారీగా సమస్యల పరిశీలన**
**దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం ఉండకూడదు**
**ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిశీలించి చర్యలు చేపట్టాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో**



**తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 21:**

ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడంతో వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 27 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో విద్యా విభాగానికి సంబంధించి 15, పోడు భూములకు సంబంధించి 3, జీవనోపాధికి సంబంధించి 4, బోర్‌వెల్, విద్యుత్ లైన్‌కు సంబంధించి 2, మావోయిస్టుల లొంగుబాటు అనంతరం జీవనోపాధికి సంబంధించి 1 దరఖాస్తు ఉన్నాయి. అదేవిధంగా గిరిజన సహాయ నిధికి సంబంధించి 2, గ్రామ పంచాయతీ భవనం పెండింగ్ పనులకు సంబంధించి 1 దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గిరిజన దర్బార్‌లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పీఓ లెనిన్ వత్సల్ సూచించారు. గిరిజనుల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి, దరఖాస్తులకు సత్వర పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితం చేయకుండా, వాటి పరిష్కారం వరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులు నమోదు చేసుకుని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ జానార్ధన్, ఏపీఓ దామోదర స్వామి, ఏఓ అనిల్‌కుమార్, ఈఈ ప్రవీణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# వంగలపూడిలో ‘మూడో ప్రపంచ యుద్ధాన్ని ఆపండి’
# శాంతి ప్రచారం

**తెలుగు గళం న్యూస్ రాజమండ్రి,సెప్టెంబర్ 21**




ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని అహ్మదీయ ముస్లిం జమాఅత్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం వంగలపూడిలో ‘మూడో ప్రపంచ యుద్ధాన్ని ఆపండి’ అనే నినాదంతో శాంతి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.యుద్ధాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల మానవాళికి ఎదురయ్యే తీవ్ర పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా స్థానిక మసీదు గురువు మొహమ్మద్ అక్బర్ మాట్లాడుతూ..యుద్ధాల వల్ల అత్యధికంగా నష్టపోయేది అమాయక ప్రజలు, చిన్నారులు, మహిళలు, భవిష్యత్ తరాలేనని అహ్మదీయ ముస్లిం జమాఅత్ ప్రస్తుత ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ హెచ్చరించారని తెలిపారు. ప్రపంచంలో శాశ్వత శాంతి నెలకొల్పాలంటే యుద్ధం, హింసకు బదులుగా న్యాయం, సహనం, పరస్పర గౌరవం, చర్చల మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ప్రపంచ నాయకులు న్యాయం, దౌత్యం, పరస్పర చర్చలు, శాంతి స్థాపన వైపు దృష్టి సారించాలని నిరంతరం పిలుపునిస్తున్నారని పేర్కొన్నారు. మూడో ప్రపంచ యుద్ధం సంభవిస్తే, ముఖ్యంగా అణ్వాయుధాల వినియోగం వల్ల మానవాళికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించిన విషయాన్ని వివరించారు.వంగలపూడి మసీదు అధ్యక్షుడు షేక్ అహ్మద్ అలీ మాట్లాడుతూ..ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ప్రేమ, సోదరభావం, పరస్పర అవగాహన పెంపొందించడం ద్వారా శాంతియుత సమాజాన్ని నిర్మించవచ్చని గురువు తారిఫ్ అహ్మద్ అన్నారు.‘అందరినీ ప్రేమించు--ఎవ్వరినీ ద్వేషించకు’ అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, ఇస్లాం మానవ సేవ, శాంతి, న్యాయం, సోదరభావాన్ని బోధిస్తుందని అహ్మదీయ ముస్లిం జమాఅత్ తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి తెలిపారు. ప్రపంచాన్ని విధ్వంసం నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో శాంతి కోసం కృషి చేయాలని కోరారు.ఈ ప్రచారంలో భాగంగా ప్రజలకు శాంతి సందేశాన్ని అందిస్తూ యుద్ధాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు.ప్రపంచ శాంతి, మానవత్వం, సోదరభావం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అహ్మదీయ ముస్లిం జమాఅత్ వంగలపూడి అధ్యక్షుడు షేక్ అహ్మద్ అలీ, మసీదు గురువు అక్బర్, వజీరుద్దీన్, షేక్ ఖాసీం ఫారుక్, నాగూర్ సాహెబ్, షేక్ యాకూబ్, షేక్ దాదా మొహియుద్దీన్, లతీఫ్‌తో పాటు యువకులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ జన్మదినం సందర్భంగా ఘనంగా రక్తదాన శిబిరం



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉడత నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భూపాలపల్లి పట్టణ సీఐ శ్రీనివాస్,భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి,మాజీ జిల్లా అధ్యక్షుడు,కౌన్సిలర్ యుగేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత సమాజ సేవలో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు.ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందని,యువత పెద్ద సంఖ్యలో ముందుకొచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో పార్టీ,యువమోర్చా ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్,జన్నే మొగిలి,జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేందర్,రవికిరణ్,రాజుతో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం: మంత్రి సీతక్క

**ప్రజా హక్కుల కోసం బాపూజీ పోరాటం స్ఫూర్తిదాయకం**

**బాపూజీ ఆశయాల సాధనే నిజమైన నివాళి**

**ట్యాంక్‌బండ్‌పై బాపూజీ విగ్రహానికి మంత్రి సీతక్క నివాళి**





తెలుగు గళం హైదరాబాద్, సెప్టెంబర్ 21:

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ వేత్త, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దేశం కోసం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ, అనంతరం తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. పదవులు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ఆయన అధిక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గుండు సుధారాణితో పాటు పలువురు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో ఘనంగా గురజాడ జయంతి వేడుకలు



నెల్లూరు జిల్లా రాపూరు (తెలుగు గళం):-నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలోని గ్రంథాలయంలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి అంజయ్య మాట్లాడుతూ.. సమాజ చైతన్యానికి గురజాడ అప్పారావు చేసిన సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం, "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" వంటి గేయాలు సమాజానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, భాస్కర్‌రెడ్డి, చిన్నస్వామి, దమ్మాయి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# లింగపాలెంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం"








సత్తుపల్లి/వేంసూరు, సెప్టెంబర్ 21 (తెలుగుగళం)న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల లింగపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని లింగపాలెం-3 అంగన్వాడీ కేంద్రంలో వేంసూరు సెక్టార్ సూపర్ వైజర్ కమల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎర్రా రమేష్, ఉప సర్పంచ్ గన్నేని సురేష్ లు కార్యక్రమంలో పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన వివిధ ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో బి. సత్యవతి మాట్లాడుతూ ఆహార పదార్థాల్లోని పోషక విలువలు కోల్పోకుండా వంట చేసే విధానాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇద్దరు గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించి తగిన సూచనలు చేశారు. ముగ్గురు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో: సెక్టార్ సూపర్‌వైజర్ కమల, పంచాయతీ కార్యదర్శి రవితేజ, అంగన్వాడీ టీచర్లు జీవమ్మ, లక్ష్మి, విజయదనమ్మ,గ్రామ పెద్దలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లాపూర్‌లో ఘనంగా నూతన వస్త్రధారణ వేడుక

**చిన్నారులను ఆశీర్వదించిన తోట అర్చన**



తెలుగు గళం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పిట్లం మండలం అల్లాపూర్ గ్రామ సర్పంచ్ గైని విజయ పోచయ్య కుమారుడు, కుమార్తె నూతన వస్త్రధారణ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సతీమణి తోట అర్చన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆప్యాయంగా ఆశీర్వదించి, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి కొంతసేపు ఆనందంగా గడిపారు. అనంతరం అల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో కూడా తోట అర్చన పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చింతలమోరి పాఠశాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**విద్యార్థుల సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తాం**

**త్వరలో మెరుగైన పాఠశాల వసతులు కల్పిస్తామని హామీ**





తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 21:

మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఏటూరునాగారం మండల కాంగ్రెస్ నాయకులు చింతలమోరి గ్రామంలోని పాఠశాలను పరిశీలించారు. వర్షం కురిసిన సమయంలో పాఠశాల పైకప్పు నుంచి నీరు కారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే మెరుగైన పాఠశాల వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, టౌన్ అధ్యక్షుడు కే.రంజిత్, కందుకూరి రతన్ తదితరులు పాల్గొన్నారు.

# చింతలపూడిలో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

**నాటు సారాయి స్వాధీనం, మహిళ అరెస్ట్**



తెలుగు గళం, చింతలపూడి: ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి. శ్రీలత, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.వి.ఎన్. ప్రభు కుమార్, మరియు జిల్లా ఎక్సైజ్ అధికారి ఏ. ఆవులయ్యల ఆదేశాల మేరకు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం (21-09-2026) ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో నిర్వహించిన తనిఖీలలో నత్తా ఇందిర అనే మహిళ వద్ద నుంచి 2 లీటర్ల అక్రమ నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో కూడా అధికారులు సోదాలు చేపట్టారు. అదేవిధంగా, లింగపాలెం మండలంలోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎక్సైజ్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. షాపు నిర్వాహకులు తప్పనిసరిగా 'సురక్ష యాప్' ద్వారానే మద్యం అమ్మకాలు జరపాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐలు అబ్దుల్ ఖలీల్, జె. జగ్గారావు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సీఐ పి. అశోక్ పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభుత్వ యంత్రాంగాన్ని అలెర్ట్ చేసిన హోంమంత్రి అనిత

**బుధ, గురువారాల్లో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు ఆదేశాలు**

**వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**వాగులు, కాజ్‌వేల వద్ద ప్రత్యేక నిఘా -- SDRF, NDRF బృందాలు సిద్ధంగా ఉంచాలి**




తెలుగు గళం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో తీవ్రవాయుగుండంగా బలపడి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నత స్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.

తీవ్రవాయుగుండంప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హోంమంత్రి తెలిపారు. ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి సూచించారు. ఒడిశా సరిహద్దు జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అధికారులకు సూచించారు

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా నిత్యావసరాలు, వైద్యం,ఇతర అత్యవసర సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు.పొంగిపొర్లే వాగులు, ప్రమాదకరమైన కాజ్‌వేలు, ముంపు ప్రాంతాల వద్ద తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని హోంమంత్రి ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా వాహనాలు, ప్రజల రాకపోకలను కట్టడి చేయాలని సూచించారు.

ఈ తీవ్రవాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు. చెట్లు, భారీ హోర్డింగ్స్, పాతబడిన/ శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదని సూచించారు. ప్రజలందరూ ప్రభుత్వం జారీ చేసే అధికారిక సూచనలను పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.